




వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు: వైద్య రంగంలో దేశంలోనే సరికొత్త అధ్యాయానికి సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టిందని కందుకూరు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి చెప్పారు. జనార్దన కాలనీలో వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎంఎల్ఎ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల పాలిట వరంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిలుస్తోందన్నారు. నిరుపేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్య, ఆర్థిక అభివృద్ధి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యం, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ వైద్యులతో గ్రా మాల్లోనే వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి పెంచలయ్య, పురపాలక సంఘ కమిషనర్ ఎస్ మనోహర్, డాక్టర్లు ,అంగన్వాడీ టీచర్స్ ,వలంటరీలు, వైసిపి ముఖ్య నేతలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నేతల కళ్లల్లో ఆనందం కోసం..!

- తెల్లరాయి దగ్గరుండి తలరిస్తున్నారు...!
- అధికారుల అండ 'దండాలు'
- ఎక్కడ మాఫియా అక్కడే గప్‌చుప్

"సూరిబావ కళ్లలో ఆనందం కోసం" అన్నట్లు అధికారపార్టీనేతల కళ్లల్లో ఆనందం చూడడానికి కొందరు అధికారులు రాత్రి, పగలు కళ్లుమూసుకొని చూసీ, చూడనట్లు ఉన్నారు..సైదాపురంలో సాగుతోన్న అధికారులు ఎవరూ స్పందించడం లేదు.. నెల్లూరు కెజిఎఫ్ మాఫియా అవినీతి అనకొండలు కొండలు, గుట్టలు తవ్వి అవినీతి ఆనవాళ్లు కనిపించకుండా అక్కడే మాపి చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.. రెవెన్యూ, పోలీస్, మైనింగ్, అటవీశాఖ అధికారుల అండ దండలతో ఇప్పటి వరకు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేసిన మాఫియా కాస్త వివాదం ఇవ్వడంతో.. ఉన్నతాధికారులు కన్నెర్ర చేయడంతో స్థానిక అధికారులు హడావుడి అంతా ఇంతకాదు..నాలుగు నెలల నుంచి కళ్లముందు అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. యార్డుల్లో కోట్ల రూపాయల రాయి ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అధికారులు ఎవరూ కెజిఎఫ్ వైపు కన్నెత్తి చూడడం లేదు. శుక్రవారం సైదాపురంలోని హిటాచీలు, జెసిబిలు, లారీలు, టిప్పర్లు నెల్లూరు, గూడూరుకు తరలించారు.



గేటుకు తాళం వేసిన దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సైదాపురం మైనింగ్ మాఫియా అవినీతి బాగోతంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నేతలు, అధికారులు బాగస్వామ్యం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ పరిస్థితి గమనిస్తే ఇది నిజమే అన్నట్లు తెలుస్తోంది. "ప్రజాశక్తి" పరిశీలనలో అనేక విషయాలు బయటకొచ్చాయి.. కొందరు వ్యక్తులు మైనింగ్ నుంచి లీజులు తీసుకొని, తమకు కేటాయించిన చోట్ల నుంచి రాయి తవ్వకాలు చేసి, వ్యాపారాలు సాగిస్తున్నారు. ఐదు నెలల నుంచి సైదాపురంలో తెల్లరాయి మాఫియా ఏర్పడింది. చైనాలో తెల్లరాయికి గిరాకీ పెరగడంతో , వైసిపి నేతలు కొందరు, స్థానిక టిడిపి నేతల సహకారంతో గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి లీజు చెల్లించకుండా కోట్ల రూపాయలు దర్జాగా దోచుకుంటున్నారు. ప్రభుత్వ, పట్టా, అటవీ, భూముల ఎక్కడ పడితే అక్కడ అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. టన్ను రూ.2 వేల నుంచి రూ. 22 వేలకు పైగా చేరింది. ఈ అవకాశం ఉపయోగించుకోడానికి వైసిపి నేతలు రంగంలోకి దిగారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కపెట్టుకోవాలనే ఉద్దేశంతో అధికారం ఉండగానే తెల్లరాయి వెనుకేసుకోవాలని భావించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి హిటాచీలు, టిప్పర్లు, లారీలు, జెసిబీలు సైదాపు రంలో వాలిపోయాయి. భూమి ఎవరిదైనా సరే తవ్వేసి, సరిహద్దులు తరలించడమే. ఇందుకు అన్ని శాఖ అధికారుల అండదండలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. రెవెన్యూ భూముల్లో తవ్వకాలు చేస్తుంటే తహాశీల్దారు పట్టించుకోరు. మైనింగ్ అనుమతి లేకున్నా అధికారులు అటు వైపు చూడరు.. అటవీ భూములు, కొండలు, గుట్టలు తవ్వి రాయి తీస్తుంటే అధికారులకు కనిపించవు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారు. ఎందుకు భయ పడు తున్నారు. ఈ అవినీతిలో ఆయా శాఖల అధికారుల వాట ఎంత అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ ఎవరైనా పోలీసులకు సమాచారం ఇస్తే పోలీసులు మాఫియాకు సమాచారం ఇచ్చి అలర్ట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు వేల కోట్లు రాయి తరలిపోయిందని తెలుస్తోంది. కోట్లాది రూపాయల రాయి యార్డ్‌లో ఉన్నా ప్రశ్నించే అధికారులు కనిపించడం లేదు. సహజ సంపదను కొందరు వ్యక్తులు కొల్లగొడుతుంటే ప్రభుత్వం చూస్తుంది. అధికారులు కాపలా కాస్తున్నారు...

నేతల కళ్లలో ఆనందం కోసం...!

అధికారపార్టీ నేతల కళ్లలో ఆనందం కోసం అవినీతి, అక్రమాలను ప్రశ్నించాల్సిన అధికార యంత్రాంగం కళ్లు ఉండి చూడలేదని గుడ్డివారిలా మారుతు న్నారు. తమ పోస్టింగ్ నిలుపు కోడానికి, మాఫియా సహకారం కోసం అధికారులు అండ దండలు పెడుతున్నారు. సామాన్య ప్రజలకు లైసెన్స్ లేదని స్కూటర్, ట్రాక్టర్లు, ఇతర వాహనదారులకు వేలకు వేలు ఫైన్ వేసే అధికారులు వందలాది వాహనాలు తరలిపోతున్నా పట్టంచుకోవడం లేదు. ప్రతి రోజూ సైదాపురం నుంచి 100 నుంచి 200 లారీలు చెన్నయ్ వెళ తున్నాయి. ఒక్క లారీ సరుకు సుమారు రూ.3 నుంచి రూ.4 లక్షలు అవుతోంది. ప్రతి రోజూ సుమారు రూ.10 కోట్ల తెల్లరాయి తరలిపోతుందని చెబుతున్నారు. నెలకు రూ.300 కోట్లు, ఐదు నెలలకు సుమారు రూ.1500 కోట్లు అవినీతి జరిగిందని తెలుస్తోంది. ఇంత జరిగినా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం గురించి అధికారులు ఎవరూ మాట్లాడడం లేదు. సైదాపురంలో సాగుతోన్న మాఫియా ఆగడాలు అంతా ఇంతా కాదు. అక్కడ పరిస్థితులు చూస్తే అధికార యంత్రాంగం ఉందా,? ప్రభుత్వం పాలన సాగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నెంబర్ 528, 528బి, 522బి, దేవర తిప్పను మాఫియా గుల్లగుల్ల చేశారు. హిటాచీలతో ఎక్కడికక్కడే తవ్వకాలు చేసి, రాయిని తరలించారు. సర్వేనెంబర్ 793,కొండలలో రెవెన్యూ భూమి 114 ఎకరాలుంది. ఇక్కడ రెవెన్యూ అధికారులు చిన్న బోర్డు ఏర్పాటు చేసి, అది అక్కడుండగానే మొత్తం కొండను తవ్వేశారు. ఎటూ చూసినా అవినీతి, అక్రమాలు చేసి, అవి కనిపించకుండా సర్దుబాటు చేశారు. ఇవేవీ ఒక్క అధికారికి కనిపించడం లేదు. లీజ్ సమయం ముగిసి తవ్వకాలు చేసుకుం టున్నారు. అధికారపార్టీ నేతలు ఇందులో ప్రధాన సూత్రధారులుగా కనిపిస్తుంది. టిడిపి నేతలు బాగస్వామ్యులుగా ఉన్నారు. అధికారులకు ఎవరి వాట వారికి అందినట్లు ప్రచారం సాగుతోంది. ఐదు నెలలుగా మాఫియా రెచ్చిపోతుంటే ఐదు రోజుల నుంచి వివాదం బయటకు రావడంతో ఇప్పుడు అదికారుల నటన చూసి ప్రజలు విస్తుపోతున్నారు. కోట్ల రూపాయి రాయి యార్డ్‌ల్లో ఉన్నా అది ఎవరిది అని అడిగే ధైర్యం ఒక్క అధికారి చేయడం లేదు. ఇంత జరుగుతున్నా ఇందులో ఏం జరిగింది, ?ఎంత మందికి అనుమతి ఉంది,? ప్రభు త్వానికి ఎంత ఆదాయం వచ్చింది.? చర్యలు ఏం తీసుకున్నారు ? అనే విషయాలు చెప్పడానికి ఒక్కరు ముందుకు రాకపోవడంతో అనుమానాలు మరింత ఎక్కువయ్యాయి.



టిడిపి ఓట్ల తొలగింపునకు వైసిపి భారీ కుట్ర

ప్రజాశక్తి-కందుకూరు: ఓటరు జాబితాలో తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల ఓట్లు తొలగించేందుకు భారీ కుట్ర జరుగుతోందని, నాయకులంతా అప్రమత్తంగా ఉండి ఆ కుట్రలను తిప్పి కొట్టాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ పిలుపునిచ్చారు. కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విస్తత స్థాయి సమావేశం కందుకూరు లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగింది.షరీఫ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వేల ఓట్లు తొలగించేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తే, రెవిన్యూ, పోలీస్ అధికారులు కూడా సహకరించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అధికారులపై చర్యలు తీసుకునేలా కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. అదే రీతిలో మిగిలిన నియోజకవర్గాల్లో కూడా పదివేల ఓట్లు చొప్పున తీసివేసేందుకు జగన్మోహన్ రెడ్డి ప్లాన్ చేశారని అన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 19వ తేదీలోగా పరిష్కరించుకోవాలని కోరారు. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇకనుంచి 45 రోజులపాటు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సమావేశంలో దామా మల్లేశ్వరరావు, రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీనరసి ంహం, నార్నే రోశయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గుడ్లూరు: మండలంలో సీజనల్ వ్యాధులు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు రాకుండా మందస్తుగా గ్రామపంచాయతీ సెక్రటరీ అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలన్నారు.

ప్రమాదకర స్థితిలో కార్మికులు

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-నెల్లూరు: బిజేపి అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్ల దేశంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుందని, దానిని రాష్ట్ర ప్రభుత్వం సమర్థిస్తుందని, ఇదే జరిగితే దేశ ప్రజలు దివాలా తీస్తారని, ఆర్థిక భారాలతో విలవిల్లాడుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు అన్నారు.రాష్ట్రంలో, దేశంలో అసమానతలు లేనటువంటి అభివృద్ధి సాధించాలన్న నినాదంపై ప్రజలను సిపిఎం సమీకరించాలని భావించిందని, ఆ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నగరంలోని డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం కార్మికులకు చంద్రన్న, జగనన్న ఇద్దరూ ఒక్క రూపాయి కూడా అందజేయలేదన్నారు. భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమానికి కార్మిక సంఘాలు పోరాటం చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే విధంగా అఖిల భారత స్థాయిలో చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు.జిల్లాలో రెండు లక్షలకు పైగా ఉంటారన్నారు. వీరందరూ ఆటో,హమాలీ,భవన నిర్మాణ కార్మికులు, షాపింగ్ మాల్స్‌లో, ఇటుక బట్టీల వద్ద, చిన్న చిన్న పరిశ్రమల్లో పనిచేసే వారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన 73 షెడ్యూల్ ఇండస్ట్రీస్‌లో పనిచేసే 50 లక్షల మంది కార్మికులు, ఇలా ఇతర రంగాలకు చెందిన వారన్నారు.కనీస వేతనాలు అందడం లేదని, అంతే కాకుండా ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్, చివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఉండవన్నారు. కేంద్రంలో బిజేపి అధికారంలోకి వచ్చిన అనంతరం పెట్రోల్, డీజిల్, గ్యాస్ పై రూ.11 లక్షల కోట్లు మేర పన్ను వసూలు చేశారన్నారు. ప్రతి వస్తువు ధర పెరిగిందని, అందుకు అనుగుణంగా ప్రజల ఆదాయం పెరిగిందా అని ప్రశ్నించారు. తాగే నీటిని సైతం వ్యాపారం చేసి కార్పొరేట్ శక్తులను ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రానికి 5 సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని ప్రకటిస్తే , కాదు మేము 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా కల్పిస్తామని బిజెపి హామీ ఇచ్చిందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాని, విభజన హామీలను కేంద్రం అమలు చేయడం విస్మరించిందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోని ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఈ సదస్సులో దాదాపుగా 16 డిమాండ్లతో కలిపి అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం ప్రభుత్వం రూపొందించాలంటూ తీర్మానం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మూడు బృందాలు పాదయాత్రలు నిర్వహించాయని, 13వ తేదిన నగరంలోని నర్తకీ సెంటర్‌లో భారీ బహిరంగ సభ విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. ఈ పాదయాత్రల సమయంలో సిపిఎం బృందాల దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సదస్సులో నాయకులు జి.నాగేశ్వరరావు, మహిళా నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ , తదితరులు ప్రసంగించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, సిఐటియు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, తదితరులు

మైనింగ్ అక్రమాలపై టిడిపి ఆందోళన

నేతలు గృహ నిర్బంధం
సైదాపురం చేరుకున్న ముఖ్యనేతలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సైదాపురంలో సాగుతోన్న మైనింగ్ అక్రమ దందా వ్యవహారంలో నిజాలు నిగ్గు తేల్చడానికి టిడిపి నేతలు శుక్రవారం సైదాపురం వెళ్లడానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు తెల్లవారు జామున ఆపార్టీ ముఖ్యనేతల ఇళ్ల వద్ద చేరుకున్నారు. ఎవరిని బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి సంతపేటలోని తన నివాసం నుంచి వెళ్లడానికి ప్రయత్నం చేశారు. భారీగా అక్కడకు చేరుకున్న పోలీసులు అడ్డుకున్నారు. తాను వివాహానికి వెళ్లలని బయటకు వెళ్లడానికి అనుమతించాలని కోరారు. పోలీసులు వలయంగా ఏర్పడి బయటకు రానివ్వలేదు. పోలీసు తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సైకో జగన్ ఇంటి వద్దకు వెళ్లి పహరా కాయలన్నారు. 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీసుల కళ్లుకప్పి తన వాహనంలో సైదాపురం చేరుకున్నారు. మార్గ మధ్యలో లారీల్లో నెల్లూరు తరలిస్తున్న హిటాచీలను చూశారు. డ్రైవర్లను ఆరా తీశారు. సైదాపురం మండలం, తుమ్మలతలుపూరుకు ముఖ్యనేతలు చేరుకున్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు వెళ్లారు. మీడియాలో రాసిన విధంగా సైదాపురంలో వేల కోట్ల అక్రమాలు జరగుతున్నాయని నేతలు ఆరోపించారు. కొండలు, గుట్టలు గుల్ల చేస్తున్నారు. సిద్దలయ్య కోన రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగినా చూడకుండా తవ్వకాలు చేశారన్నారు. ప్రతి రోజూ రూ.10 కోట్ల విలువైన తెల్లరాయి తరలిపోతుందని, నెలకి రూ.300 కోట్లకు వరకు విలువు ఉంటుందన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి లీజు చెల్లించకుండా కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయం నెల్లూరు ఎంఎల్ఎ అనిల్‌కుమార్ యాదవ్ చెబుతు న్నారన్నారు. ఇక్కడ ఏం జరగుతుందో తెలుసుకోడానికి వస్తుంటే పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారని, ప్రజా స్వామ్యం ఖూనీ అయిందన్నారు.




ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి ఇంటి వద్ద పోలీసులతో వాగ్వాదం చేస్తున్న దృశ్యం

నూతన జాబితాను ఓటర్లు సరిచూసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

బిఎల్‌ఓల నిర్వహణలో ఇంటింటికి తిరిగి విచారించి అన్ని రకాల ఫారంలను క్షుణ్ణంగా పరిశీలించి సవరణల అనంతరం జాబితా తుది దశకు చేరిన నూతన జాబితాను ఓటర్లందరూ పరిశీలించుకుని వివరాలను సరిచూసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని సిటీ అసెంబ్లీ నియోజకవర్గం-117 ఓటర్ మూల జాబితా రోల్-2024 లిస్టును శుక్రవారం ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విడుదల చేసిన ఓటర్ జాబితాలను సంబంధిత అన్ని పోలింగ్ స్టేషన్లో పాటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రచురణకు ఉంచామన్నారు. జనవరి 5, 2024 వ తేదీ నాటికి జాబితా సవరణలను పూర్తి చేసి ఫైనల్ డ్రాఫ్ట్ రోల్ ను ప్రకటిస్తామన్నారు. ప్రస్తుత జాబితాలో చేర్పులు ఉన్నవారు సంబంధిత బిఎల్ఓ లను సంప్రదించి సవరణలకు అవసరమైన దవీకరణ పత్రాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇఆర్‌ఓలు దేవి కుమారి, ధనుంజయ రెడ్డి, దశయ్య, ఎలక్షన్ డిటి మాధవి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



జాబితా రోల్‌ను చూపుతున్న కమిషనర్



కుట్టుమిషను అందజేస్తున్న దృశ్యం

60 మందికి కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏలుబడిలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని శాసనమండలి మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంఎల్‌సి మహమ్మద్ అహ్మద్ షరీఫ్ విమర్శించారు. ప్రజలను కులాలు, మతాలు వారీగా విభజించి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. కార్యక్రమానికి షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఇంటూరి నాగేశ్వరావు అధ్యక్షతన కందుకూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షరీఫ్ మాట్లాడుతూ కీర్తిశేషులు ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో తెలుగు రాష్ట్రాలలో బడుగు బలహీనవర్గాల కు అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వర రావు, జనిగర్ల నాగరాజు, నార్నీ రోశయ్య, కంద్రా మాల్యాద్రి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నరుకూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ లావణ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా నిరుపేదలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి మెరుగైన వైద్యాన్ని అం దించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుత మైన కార్యక్రమన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ అన్నం శారద, వైసీపీ నాయకులు, వెలిచెర్ల శ్రీని వాసులు, వేగూరు శ్రీనివాసులు, ముసలి పరం ధామయ్య, వైద్య ఆరోగ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశుమరణాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మాతా శిశు మరణాలు నివారణే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఫ్యామిలీ హెల్త్ టీమ్ సభ్యులు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా క్టర్ పెంచలయ్య ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పేడూరు పంచాయతీ కొలిదిబ్బ ఎస్‌టి కాలనీలో ఆరోగ్య సూచీలపై సమగ్ర గణాంకాలు నివేదికలకు క్షుణ్ణంగా సర్వే జరిగింది. ఈ సందర్భంగా టీంలీడర్ చంద్రకళ, నోడల్ అధి. కారులు టి రాజయ్య, సిహెచ్ సుధా కర్ రావులు మాట్లాడారు. కార్యక్రమంలో సుమలత, ప్రణీత, దీపిక, శామ్యూల్, వీరాస్వా మి, పరమేష్, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఈ ఖరీఫ్ 2023 సీజన్ లో రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ కుమార్ స్పష్టం చేశారు. మండల వ్యవసాయ అధికారి వివి శిరీష రాణి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆ ర్బికేల పరిధిలో ఈక్రాప్ నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఎ రాజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన ఈ-క్రాప్ నమోదు వలన కలిగే ప్రయోజనాలను తెలిపా రు. క్రార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షర్మిల, రైతులు పాల్గొన్నారు.

రెతులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు రెండవ వేలం కేంద్రం పరిధిలో వేలం నిర్వహణ అధికారి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పొగాకు రైతులకు మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అయన మాట్లాడుతూ ప్రతి పొగాకు రైతు విధిగా 10 మొక్కలను పెంచాలని తెలిపారు. దీని వలన పర్యావరణాన్ని కాపాడిన వారము అవుతామని తెలిపారు. అంతేకాకుండా ఈ రోజు నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని కోరారు.



ఈ-పంట నమోదు జాబితా ప్రచురణ

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని పాలూరు రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ 2023 సీజన్ లో వేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకొన్న రైతుల పేర్లను సామాజిక తనిఖీకు ముసాయిదా జాబితాను రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకుడు సిహెచ్ బ్రహ్మయ్య ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి వి రాము విచ్చేసి,, రైతులం దరూ ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు, సర్వే నంబర్, ఖాతా నెంబరు,విస్తీర్ణం, పంట సాగు విధానం అన్నింటినీ పొందుపరచారు.పై కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

శనగ విత్తనాల కోసం పేర్లు నమోదు

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని రబీ 2023-24 సీజన్ లో శనగ పంట వేయు రైతులు శుక్రవారం నుంచి మీ రైతు భరోసా కేంద్రాలలో సంబధిత గ్రామ వ్యవసాయ అధికారి దగ్గర విత్తనాలు కావలసిన రైతులు మీ ఆధార్ కార్డు, పాస్ పుస్తకం , మొబైల్ ఫోన్ నంబర్ తీసుకొని వెళ్ళి నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి రాము కోరారు. ఎకరాకు 40కేజి ల చొప్పున ఒక్కొక్క రైతుకి పొలాన్ని బట్టి 5 ఎకరాలకు బయోమెట్రిక్ విధానంలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఉమేష్ చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వాహించారు.శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులకు "లైంగిక వేధింపుల నుండి మహిళలు, పిల్లల రక్షణ-సామాజిక పాత్ర" అనే అంశంపై, పోలీసు ఉద్యోగులకు "సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాల అరికట్టడంలో సాంకేతికత పాత్ర" అనే అంశాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతున్న వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయుట, పోలీస్ శాఖ పట్ల పూర్తి స్థాయిలో అవగాహన, స్ఫూర్తి కల్పించుటయే ముఖ్య ఉద్దేశంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్‌పి (ఎఆర్), డిఎస్‌పి (ఎఆర్), ఎస్‌బి సిఐ, పిఆర్‌ఓ ఆర్‌ఐ, ఆర్‌ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 13 సేవా ప్రాజెక్టులు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 13 సేవా ప్రాజెక్టులతో సేవలు చేస్తున్నామని రెడ్‌క్రాస్ చైర్మన్ , ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. నగరంలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ వై ఆర్ జి కేర్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డయాగ్నస్టిక్ సెంటర్లో వసతులను ఆయన పరిశీలించి అనంతరం రక్త పరీక్షలు చేయించుకున్నారు. డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా వైద్య సేవలను పటిష్టం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చులతో ప్రజలకు వైద్య పరీక్షలు అందించాలని ఉద్దేశంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వై ఆర్ జి కేర్ డయాగ్నస్టిక్ సెంటర్ ను ప్రారంభించామన్నారు. వై ఆర్ జి కేర్ డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా అత్యాధునిక పరికరాలతో క్వాలిఫైడ్ సిబ్బందితో అన్ని రక్త పరీక్షలను అతి తక్కువ ధరలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో డయాగ్నస్టిక్ సెంటర్ లో డాక్టర్ పర్యవేక్షణలో వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లా ప్రజలు డయాగ్నస్టిక్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, సురేష్ కుమార్ జైన్, కలికి శ్రీహరి రెడ్డి, కన్వీనర్లు రవీందర్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు అభివృద్ధికి అగ్ర తాంబూలం.

ప్రజాశక్తి-పొదలకూరు

మండలంలో సుదీర్ఘకాలంగా, అపరిష్కతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ, పొదలకూరు అభివద్ధికి అగ్ర తాంబూలం వేస్తున్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పొదలకూరులో రూ.2.60 కోట్లతో నిర్మాణం పూర్తయిన నెల్లూరు-పొదలకూరు, పొదలకూరు-మనుబోలు లింకురోడ్డు అయిన బిరదవోలు-చాటగొట్ల ఆర్ అండ్ బి తారురోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పొదలకూరును అన్ని విధాల అభివద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సుదీర్ఘకాలంగా అపరిష్కతంగా ఉన్న రోడ్డు నిర్మాణాలను పూర్తి చేస్తున్నామని, ఇందులో భాగంగా పొదలకూరు ప్రధాన రహదారిని పునర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పొడమేకల కండ్రిక రోడ్డును పూర్తి చేస్తామన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్ కుమారి, తహశీల్దార్ వీర వసంత కుమార్, జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు వెన్నపూస శ్రీనివాస్ రెడ్డి, గంగిరెడ్డి, పెంచలయ్య, కష్ణ, వాకాటి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కాకాణి

అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు: పోలీసు శాఖ పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి కార్యాలయంలో పోలీసు సిబ్బంది నుంచి వినతిపత్రాలు నేరుగా స్వీకరించారు. అదే సమయంలో సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిపిఒ పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు, సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల) గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు తెలుపుతున్న సమస్యలకు సంబంధించిన అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చేజర్ల ఎంపిపి తూమాటి విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపిపి తూమాటి అధ్యక్షతన తొలి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని, దాని ద్వారా పనులు మరింత వేగవంతమవుతాయన్నారు. నెలకో మారు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు అధికారులు గైర్హాజరైతే ఎలాగని, ఎటువంటి సమాచారం లేకుండా గైర్హాజరైన అధికారులపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఎంపిడిఒ విజయలక్ష్మిని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా నవంబర్ 2వ తేదిన జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, మండలంలోని నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ, జెడ్‌పిటిసి పీర్ల పార్థసారథి, వైస్ ఎంపిపి వేలూరు తిరుపతి నాయుడు, ముగ్గుబుడి రఘురామిరెడ్డి, అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

బెజవాడ గోవర్ధన్‌రెడ్డి పార్కులో పరిశీలన



ప్రజాశక్తి - బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చి నగరంలో త్వరలో ప్రారంభం కానున్న బెజవాడ గోవర్ధనరెడ్డి పార్క్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. పార్కులో అన్ని వసతులు, ప్రతిపాదిత అంశాలు సంపూర్ణమైన తరువాతనే ప్రారంభించడం మంచిదన్న విషయమై చర్చించారు. గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ పనులు పరివేక్షిస్తున్న మున్సిపల్ కాంట్రాక్టర్ చిరమన సురేష్ సూచించారు. పార్కులో నిర్మించిన వాకింగ్ ట్రాక్ సామర్థ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ చిరమన సురేష్ మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటున్న థీమ్ పార్కును పచ్చదనంతో పాటు విద్యుత్ వెలుగుల విరజిమ్మే విధంగా వివిధ రకాల పూలమొక్కలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వాకింగ్ ట్రాక్, విశాలమైన స్థలంలో బెంచీల ఏర్పాటు, వృద్ధుల మహిళల కోసం యోగా, కరాటే, మెడిటేషన్ తదితర వసతులు, యువతకు వ్యాయామ పరికరాలు ఓపెన్ జిమ్, పిల్లలకు ఆట వసతులను ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశీలన అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ కోటి రూపాయల నిధులతో పార్కు అభివృద్ధికి సహకరించిన ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి పార్కులను ప్రజలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నగరానికి తలమానికంగా బెగోర పార్క్ నిలవనుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జయంతి, షకీలా, అనంతమ్మ, ప్రమీలమ్మ, కాంట్రాక్టర్లు చిరమన సురేష్, ఐదిఖాన్, బిట్రగుంట సురేష్, మైనారిటీ నాయకులు డాక్టర్ అల్లాబక్షు, ఎ.ఇ. ప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోర్డుల ఏర్పాటుపై అవగాహన



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అర్ధమయ్యే విధంగా తెలియజేయడానికి డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మండలంలోని గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది వలంటీర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు డిస్‌ప్లే బోర్డులు నవంబర 1వ తేదిన బట్టేపాడు సచివాలయంలో, 2వ తేదిన నెల్లూరుపాలెం సచివాలయంలో, 3వ తేదిన చెర్లోవడ్డిల సచివాలయంలో ప్రజా ప్రతినిధులు, ప్రజల సమక్షంలో ఈ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం గురించి ఆయా సచివాలయాల పరిధిలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎంపిడిఒ అవగాహన కల్పించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమం గురించి మూడు రోజులు ముందుగా అన్ని కుటుంబాలకు తెలియజేసి కార్యక్రమం జరిగే రోజున అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఆ రోజున తమ సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ఏయే పథకం ద్వారా లబ్ధి పొందిన వివరాలను తెలుసుకొనవచ్చన్నారు. పథకాలు పొందడంలో ఎవరికైనా సమస్యలు ఉంటే ప్రజా ప్రతినిధులు, అధికారులకు తెలియపరచి తగు పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి



ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్ 2023 సీజన్లో పంట నమోదు కార్యక్రమం నిర్వహించామని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి తెలియజేశారు. ఈ పంట నమోదులో ఉన్న రైతుల వివరాలు ఆయా ఆర్‌బికెల్లో 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించడం జరుగుతుందన్నారు. పంట నమోదులో పేర్లు, ఇతర వివరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకుని సరిగా లేనిచో ఆయా ఆర్‌బికెల్లో సంప్రదించి నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. పంట నమోదై ఈ కెవైసి చేయించుకుని ఉంటేనే సున్నావడ్డీ పంట రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ, పంటలబీమా వర్తిస్తాయన్నారు. పంట వేసిన రైతు సోదరులందరూ ప్రతి సీజన్లో ఈ క్రాప్ ద్వారా కచ్చితంగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

అచీవ్‌మెంట్ సర్వేపై సమీక్ష



ప్రజాశక్తి-ఉదయగిరి : స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ఎంఇఒలు షేక్ మస్తాన్‌వలీ, తోట శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎంపికైన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు నవంబర్ 3వ తేదీన జరిగే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వేపై ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా ఎంపికైన మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిక కాబడిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలోని 3,6,9 తరగతులు అభ్యసించే విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణిత విషయాలలో నవంబర్ 3వ తేదీన పరీక్ష నిర్వహించబడుతుందని ఎంపిక కాబడిన ఆంగ్ల మాధ్యమం మాత్రమే ఉండే పాఠశాలలో ఆంగ్లం గణితం ఎంపికైన తెలుగు మాధ్యమం ఉండే పాఠశాలలలో తెలుగు, గణితంలో మాత్రమే పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. పలు అంశాలపై వారు సూచనలు అందజేశారు.



ప్రజాశక్తి-కావలిరూరల్ : మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఎంఇఒలు బి.గోవిందయ్య, సిహెచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 3న జరగబోయే ఎన్ఎఎస్/ఎస్ఇఎఎస్ పరీక్ష నిర్వహణపై కావలి మండల పరిధిలో ఎంపిక కాబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఎంపికైన పాఠశాలల్లో 3,6,9 తరగతులకు రాష్ట్రస్థాయిలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, మాధవి, సుజాత, రమణ పాల్గొన్నారు.

'కాకర్ల' ఉచిత వైద్య సేవలు



ప్రజాశక్తి-ఉదయగిరి : కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ ఎన్‌టిఆర్ సంజీవని ఆరోగ్య రథంతో 172మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శుక్రవారం దుత్తలూరు మండలం తెడ్డుపాడు రామాలయం వద్ద 157వ రోజు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సంజీవని ఆరోగ్య రథంతో అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 108మందిని డాక్టర్‌లు వివిధ ఆరోగ్య సమస్యలు పరీక్షించి 64మంది కంటి చూపు సమస్యలతో పాటు మొత్తం 172 మంది చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం టిడిపి నాయకులు ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ వైద్య శిబిరాన్ని సందర్శించి అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తుల నుండి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్‌మోహన్ రెడ్డి నిరంకుశ రాక్షస పాలనతో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై గ్రామస్తులతో నల్లజెండాలతో శాంతియుత నిరసన తెలిపారు. 186వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా 612 మంది తమ ఆకలిని తీర్చుకొన్నారు .

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కొడవలూరు

రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణ్ స్పష్టం చేశారు. కొడవలూరు మండల కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగానే స్పందన కార్యక్రమాన్ని మెరుగుపరిచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, 2019 నుంచి స్పందన కార్యక్రమం అమలు చేయడం జరుగుతోందన్నారు. దానిని పూర్తి స్థాయిలో మెరుగు పరిచి ఈ యేడాది మే తొమ్మిదో తేదీ నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల వారు జిల్లా కేంద్రానికి వచ్చి వినతులు సమర్పించేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. వీరు ఇబ్బంది లను తొలగించేందుకే మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జిల్లాలో బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో వచ్చిన అర్జీలను నేరుగా సిఎం కార్యాలయం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ప్రతి వినతిని సిఎం కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన అన్ని సమస్యలు సచివాలయ ద్వారానే పరిష్కరిస్తున్నట్లు, రెవెన్యూ సమస్య పరిష్కారం ప్రధాన ఉద్దేశంతో జగనన్నకు చెబుదాంతో అమలు జరుగుతుందన్నారు. ఈ మేరకు నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 75 వినతులు వచ్చాయని తెలిపారు. మండలంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియడం ద్వారా సమస్యను పరిష్కరించు కోవచ్చని సూచించారు. ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక బృహత్తర కార్యక్రమం జగనన్నకు చెబుదాం అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జెసి ఆర్.కూర్మనాథ్, డిసిఎంఎస్ చైర్మన్ వీరి శివారెడ్డి, జెడ్‌పి సిఇఒ బి.చిరంజీవి, ఆర్‌డిఒ శీన నాయక్, డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి, జిల్లా బాపిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ పి.సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కామాక్షి, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణ్

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-కావలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టి ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడంలో రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి) ముందుంటుందని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బారాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారం చేయకుండా గాలికి వదిలేశాయన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేసి ఉన్నాయని తెలిపారు. వాటిపై పోరాటాలు చేస్తున్న ప్రజాస్వామ్యవాదులపై అక్రమంగా కేసులు పెట్టడంతోపాటు, అనేకరకాల దాడులకు ఒడిగడుతుందని మండిపడ్డారు. అలాగే కేంద్రంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరిగి పోతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాలు దొరక్క ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నేడు రాష్ట్రంలో ఉందన్నారు. ప్రతి జిల్లాలో ఏదోక పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఆర్ఎస్‌పి నెల్లూరు జిల్లా కార్యదర్శిగా రవికాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం రవికాంత్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆర్ఎస్‌పి పార్టీతోపాటు దాని అనుబంధ ప్రజా, విద్యార్థి, యువజన సంఘాల ను బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, సీమోను, రాజేష్, మనోజ్, కిషోర్, తరుణ్, మని చంద్ర, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారాయుడు



దళిత గ్రామాలకు వైసిపి పెద్దపీట

ప్రజాశక్తి-కోవూరు

వైసిపి ప్రభుత్వం కృషితో టిటిడి దేవస్థానం చొరవతో దళిత గ్రామాల్లో ఆలయ నిర్మాణాలకు పెద్దపీట వేసిందని మాజీ మంత్రి కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని కోవూరు, విడవలూరు మండలాల్లోని దళిత గ్రామాల్లో నిర్మించిన ఆలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలోని 38దేవాలయం నిర్మాణాలకు టిటిడి బోర్డు ఆర్థిక సాయంతో రూ.3కోట్ల 80లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కొక్క ఆలయం నిర్మాణం కోసం రూ.10లక్షలు చాలడం లేదని ప్రజాప్రతినిధుల ప్రకారం ఈ నగదును ఈ దఫా రూ.20లక్షలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జమ్మిపాలెం గ్రామంలో ఆసరా పథకం కింద మహిళకు రూ.5లక్షల నగదును అందజేశారు. జెడ్‌పి నిధుల నుండి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.12లక్షలు మంజూరు చేసినట్లు జెడ్‌పిటిసి శ్రీలత అన్నారు. రైతులకు హమీలా ఛార్జీలను ప్రభుత్వం నుండి రావాల్సి ఉండగా ఎంఎల్ఎ కృషితో రూ.24లక్షల 65వేలు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు దొడ్లరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. దేవస్థానం ప్రారంభం కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ ప్రసన్న కుమార్‌రెడ్డికి గ్రామస్తులు నాయకులు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున రెడ్డి, డిఎల్‌డిఎ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్ రెడ్డి, ఎంపిపి పార్వతి, వేగూరు చంద్ర, గుత్తికొండ వెంకయ్య వైసిపి మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి పాటూరు ప్రసాద్, మాజీ ఎంపిపి ఓగు నాగేశ్వరావు, ఎంపిడిఒ శ్రీహరి, పలు శాఖల అధికారులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



రూ.20వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. జెఆర్‌పేటలోని నాలుగో వార్డుకు చెందిన షేక్ రసూల్ (46) శుక్రవారం మృతి చెందడంతో ట్రస్ట్ సభ్యులు ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. రెండో వార్డ్ వెంకట్రావు పల్లికి చెందిన బాలరెడ్డి రమణమ్మ(75) వృద్ధురాలు మృతి చెందడంతో అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్టు సభ్యులు ఆమె కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివ కోటిరెడ్డి, మెప్మా ఆర్‌పిలు మహమ్మద్ జానీ, సుజాత, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-కావలి రూరల్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఎఐటి యుసి కార్యాలయంలో జరిగిన ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కౌన్సిల్ సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలో భాగంగా ప్రకారం మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మాటతప్పని మడమతిప్పని ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలబడాలని వారి డిమాండ్ చేశారు. ధరల నియంత్రణ లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన అసౌకర్యాలకు గురవుతున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మున్సిపల్ కార్మికులకు ప్రైమరీ పనులలో పనిచేస్తు మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ కార్మికుల కుటుంబానికి రూ.40 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మున్సిపల్ రంగంలో శాశ్వత పనిలో పని చేస్తున్న డెయిలీవేజ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి ప్రస్తుతం ఒప్పంద కార్మికులకు ఎంత వేతనం చెల్లిస్తున్నారో అంతే మొత్తం ఈ కార్మికులకు కూడా ఇవ్వాలని సాంఘిక భద్రతతో భాగమైన పిఎఫ్ ఇఎస్ఐ వర్తింపజేయాలన్నారు. జిఒ నెంబర్ 25 ప్రకారం విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు స్థానిక మున్సిపాలిటీల నుంచి రూ.2 లక్షలు ప్రమాదాల బారిన పడి మరణిస్తే రూ.5 లక్షలు ఆ కుటుంబాలకు చెల్లించి వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఆ పనులో పెట్టుకోవాలని వారి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు నివేశస్థలాలు ఏర్పాటు చేసి శాశ్వత గృహాలను నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డైలీ వేజ్ కార్మికుల స్కూల్ స్వీపర్ల వేతనాలు సత్వరం విడుదల చేయాలని వారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య కార్యాచరణ రూపొందించి ఉద్యమిస్తామని వారు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గుంటి కిషోర్, జిల్లా గౌరవాధ్యక్షులు మల్లి అంకయ్య, నగర అధ్యక్ష కార్యదర్శులు ఆది నారాయణ, తన్నీరు వెంకటేష్, పట్టణ నాయకులు ప్రభావతి, రాజేష్, తన్నీరు రమాదేవి, సుభాన్, కుంచాల వేణు, నాగరాజు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బస్సుయాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి



సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని మండల సర్పంచ్ సంఘ అధ్యక్షులు శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 30న సోమవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను నియోజకవర్గ పరిధిలో ఉన్న మేకపాటి అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. 2024లో వైసిపి ఘనవిజయానికి సాంకేతానికి నాందిగా ఈ బస్సు యాత్రను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



29న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని మహిమలూరు గ్రామంలో డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ గుండ్రా సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నయ్ వారు 29వ తేదీ నుంచి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు మండలంలోని రావులకొల్లు, చెర్లో ఎడవల్లి, నాగులపాడు, గ్రామాలలో కరపత్రాలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా అక్కడే చేస్తారని తెలిపారు. మందులు కూడా ఉచితంగా ఇస్తారన్నారు. ఆత్మకూరు ప్రాంతంలో గుండ్రా సతీష్ రెడ్డి, అన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వారు అందరికీ ఆదర్శం కావాలని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కుడుములు సుధాకర్ రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి, సుమంత్, పెళ్లూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి

వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆస్పత్రుల్లో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కావలి ఐఎంఎ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. భారతీయ వైద్య సంఘం (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రపంచంలోనే అతి పెద్ద వృత్తి సంఘం అని, దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 1760 శాఖలలో నాలుగు లక్షల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 98 శాఖలలో 20వేల మందిపైగా సభ్యులున్నారని తెలిపారు. ఐఎంఎ అంటే ప్రయివేట్ వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, కానీ తమ సంఘం సభ్యులు ప్రభుత్వ ప్రయివేట్ ఆసుపత్రులలో, వైద్య కళాశాలలో సేవలు అందిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో ఆసుపత్రులపైన, వైద్యులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగి పోతున్నాయని, వాటిని నివారించి వైద్యులు తమ వైద్యసేవలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తక్షణం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య సంబంధమైన కీలక నిర్ణయాలు తీసుకునే సమయాలలో వాటిని అమలు చేసే వైద్యులకు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటే వాటిని అమలు చేసే సమయంలో ఎదురయ్యే సమస్యలు అధిగమించి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో కావలి ఐఎంఎ శాఖ అధ్యక్షులు డాక్టర్ బి సతీష్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీరామ మనోహర్ బాబు, రాష్ట్ర సంయుక్తకార్యదర్శి ఎంపికైన అధ్యక్షులు డాక్టర్ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ గోపి, కోశాధికారి డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.



పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'



ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పడమటి నాయుడుపల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపిడిఒ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ గోపినాధ్ మాట్లాడుతూ పేదలందరికీ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్యసురక్ష లక్ష్యమన్నారు. ఈ వైద్య శిబిరంలో ఊపిరితిత్తులు, గుండె, కంటి పరీక్షలు, బిపి, సుగర్ పలురకాలు వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. వైద్య పరీక్షలు అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య సురక్ష పథకంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ జయమ్మ, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెవుల శ్రీనివాసులు యాదవ్, సోషల్ మీడియా ఓంకారం శివ, నాయకులు కొండయ్య, చింతకుంట రామకృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి, మండల వైద్య విస్తరణ అధికారి కొండారెడ్డి, వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలోని తరుణవాయి జెడ్‌పి హైస్కూల్లో ఎంపిడిఒ గోపి, డాక్టర్ ప్రతిమ శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని మాజీ జెడ్‌పిటిసి తుంగా ఇందూధర్ రెడ్డి, వైసిపి నాయకులు బాలనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్కులను, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. ప్రజల వద్దకే నేరుగా వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయం సిబ్బంది, మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : పేద మధ్యతరగతి ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని మండల కన్వీనర్ సిఎం ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడినెరవ పంచాయతీలో జరుగునున్న జగనన్న ఆరోగ్య సురక్షలో ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పంచాయతీ ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో పాటు ప్రతిఒక్కరి సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమం నిర్వహించి ప్రతి కుటుంబానికి ఇంటి వద్దకే వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో పేదల స్థితిగతులను తెలుసుకొని కార్పొరేటర్ స్పెషలిస్ట్ డాక్టర్లతో ఉచిత వైద్య అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. 2024 ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ఉదయగిరి నియోజకవర్గం ఎంఎల్‌ఎగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం శిశు సంక్షేమశాఖ, వైద్యశాఖ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ, ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు, ఇఒపిఆర్‌డి మల్లికార్జున, సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ, వైద్యులు అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని ఈ పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని మండల జెసిఎస్ కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దబిపురం గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అలాగే మరో నాలుగు అడుగులు ముందుకు వేస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సుమారు 3వేలకు పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి మరింత ఆరోగ్యంపై భద్రత కల్పించిన ఘనత దక్కించుకున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి పేదవాడికి మెరుగైన ఆరోగ్యం అందిస్తుందని తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు ఆవరణలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దబీపురం వైసిపి నాయకులు సూర శ్రీనివాసుల రెడ్డి, ఎంపిడిఒ ఎం.భాస్కర్, చిరమణ ఎఎస్‌పేట వైద్యాధికారులు మంజులమ్మ, జ్యోతి రాణి, చిరంజీవి, మండల నాయకులు అల్లంపాటి కొండారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సంగం

వైసిపి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన మాదిరిగా కులమతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు వైసిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వైసిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు రఘునాథరెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం నవరత్నాల పేరుతో కులం మతం తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ సమయంలో ఎన్నికలు వచ్చినా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని వైసిపి నాయకులు రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి టిటిడి వారి సహకారంతో నిధులు మంజూరు చేయించారని తెలిపారు. నవంబర్ రెండో తేదీన మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించే మెగా జాబ్‌మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శంకర్ రెడ్డి, గృహ సారథుల కన్వీనర్ మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు కరీముల్లా, దువ్వూరు సొసైటీ అధ్యక్షులు మధన్‌మోహన్ రెడ్డి, పెరుమాళ్ల రవీంద్ర బాబు, వేణు, శివ, తదితరులు పాల్గొన్నారు.